# మినీ కథ

తమిళనాడు రాష్ట్రంలో ఓ వూరది.



సైకిల్ చోరీ అయిందని నిర్ధారణ అయే సరికి, తప్పనిసరై పోలీసుస్టేషన్‌కి వెళ్ళాడు సదాశివం. అతనికి చిన్నప్పటి నుంచీ పోలీసులంటే అదోలాంటి బెరుకు.

వెళ్ళేసరికి స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్, సెంట్రీ మాత్రమే వున్నారు. ఎస్.ఐ. లేడు. ప్రక్కనే కుర్చీలో జారగిలబడి కూచున్నాడు హెడ్డు. సదాశివాన్ని ఎగాదిగా చూశాడు.

—ఏం కావాలి?, అన్నాడు.

—సైకిల్ పోయిందండి....

—ఎప్పుడు? ఎక్కడ? ఎలా పోయింది?, అన్నాడు హెడ్డు నాటకీయంగా.

—గంట క్రితం, బజార్లో, ఎవరో తీసుకు పోయారండి...

సదాశివంవైపు తీక్షణంగా చూశాడు హెడ్డు.

—ఎవరో తీసుకుపోక, సైకిల్ దానంతటదే కూడా పోతుందా? ఇంతకూ ఎవరు తీసుకెళ్ళారో నువ్వు చూళ్ళేదన్న మాట...

—చూస్తే అక్కడే పట్టుకునే వాణ్ణి గదండి...

—అసలు నువ్వు బజారుకి ఎందుకెళ్ళావు?

—సరుకులు కొనటానికి వెళ్ళానండి...

—మధ్యాహ్నం పూట వెళ్ళి సరుకులు కొన్నావా?...ఇంతకీ నువ్వేవరు? ఏం చేస్తుంటావు?

—నేను ఎనిడిని కంపెనీలో క్లర్కునండి. మీరుచెప్పింది రైటే ..మధ్యాహ్నంపూట నేనైనా ఎప్పుడూ సరుకులు కొననుగాని, ఎల్లుండి మా తమ్ముడి పెళ్ళండి...అందుకని ఆఫీసుకి సెలవు పెట్టి...

తేను అర్థమైందన్నట్టు తలూగించాడు హెడ్డు. —అయితే తమ్ముడి పెళ్ళి హడావుడిలో వున్నారన్నమాట...సరే...సైకిల్ లాక్ చేశావా?

తడబడ్డాడు సదాశివం.—లే-లేదండి.

చల్లగా చిరునవ్వు చిందించాడు హెడ్డు.

—మరి, పోయిందంటే ..పోదూ... లాక్ చేసిన కార్లే పోతున్నాయి, సైకిల్ పోదూ...., అంటూ సాగదీసి, చప్పున గద్దించాడు—ఎందుకయ్యా లాక్ చెయ్యలేదు?

అదిరిపడ్డాడు సదాశివం. మరింత గాభరా పడిపోయాడు. —మామూలుగా అయితే లాక్ చేద్దునండి...అయితే, పక్కపొడి ప్యాకెట్టు కొనటానికని ఆ షాపుకు వెళ్ళానండి. షాపుముందే ప్లాట్‌ఫాం పక్కన సైకిల్ స్టాండేశాను...నిమిషంలో వచ్చేస్తానుగదా అనుకున్నాను. షాపు దగ్గర కొంచెం రద్దీగావుంది...అయితేనేమండి... కేవలం రెండు మూడు నిమిషాల్లో ఇవతలి కొచ్చేశాను. అంతే! సైకిల్ పోయిందండి...తిరిగిచూసేసరికి సైకిల్ పోయిందండి...

వంకరగా నవ్వాడు హెడ్డు.—తిరిగిచూసేసరికి మర్డర్లే జరిగిపోతున్నాయి తెల్సా? సైకిల్ లాక్ చెయ్యకపోవటం నీ తప్పు...పోయిందంటే పోదూమరి...పోవాల్సిందే...

—రిటన్‌గా కంప్లెయింట్ రాసివ్వనాండి?

చీదరింపుగా చూశాడు హెడ్డు. —ఎందుకు నీ కంప్లెయింటు? నాలిక గీసుకోనా? రోజుకో కట్టడొస్తాయి కంప్లెయింట్లు. పోలీసోళ్ళకేం పంచ చేతులూ, తొంభై కళ్ళూ వుంటాయా దొంగల్ని పట్టడానికి? ఇంతకూ నువ్వు ఆ షాపుముందే సైకిల్ పెట్టావని గ్యారంటీ ఏమిటి? నీవెక్కడైనా పెట్టి మర్చిపోయి, ఇక్కడ పెట్టాననుకుంటున్నావేమో? అసలే పెళ్ళి హడావుడిలో వున్నావుగద!

—ఆ షాపుముందే పెట్టానండి

—ఆ షాపుముందే పెట్టావు!. వెక్కిరింతగా అన్నాడు హెడ్డు. —ఏమిటి సాక్ష్యం? ఆ

# వ్యాపారం

షాపుముందు నువ్వు సైకిల్ పెట్టి వెళుతుంటేగా ఎవరైనా చూశారా? నువ్విస్తున్న రిపోర్టుకి సాక్ష్యమని ఏమిటి నమ్మకం? అసలింతకూ అది నీ సైకిలేనా? నీ సైకిలే అవటానికి ఏమిటి ఋజువు? నీ సైకిల్ అయితే పదిబజారులో లాక్ వేయకుండా అలా వదిలేస్తావా? సైకిల్ పోయిందని గంట తర్వాత వచ్చి చెప్తావా పోలీసుస్టేషన్‌కి? నువ్వు చెప్పేది ఎలా నమ్మమంటావ్?

ముఖమంతా చెమటలు పట్టేశాయి సదాశివానికి. కొంపదీసి తన సైకిల్‌ని తనే దొంగతనం చేయలేదు కదా అని అనుమానం వచ్చేసింది.

పగలబడి నవ్వాడు హెడ్డు. తనితర నవ్వుతున్నారు. —సరేనయ్యా! నీ సైకిల్ పోయింది. రిపోర్టిచ్చావు. మేమూ వెతుకుతాం. దొరుకుతుందనీ, దొరకాలనీ ఏమిటి గ్యారంటీ? నీ సైకిల్ తీసుకెళ్ళినవాడు నీకన్నా తెలివైనవాడే కదా! ఈపాటికి నీ బండి వూరుదాటియినా పోయి వుంటుంది. లేకుంటే షేపులు మారిపోయి వుంటుంది. ఇప్పుడు నీ సైకిల్‌నే తెచ్చి నీముందు పెట్టినా, అప్పే ఇది నాదెలా అవుతుంది? అనే స్థాయిను వ్వు. అంతగా మారిపోయివుంటుంది.

బుర్ర గోక్కున్నాడు సదాశివం. ఎందుకొచ్చానా పోలీసుస్టేషన్‌కి అని తిట్టుకున్నాడు.

హెడ్డు కుర్చీలోంచి లేచి ముందుకొచ్చి సదాశివాన్ని భుజం తట్టాడు. కొంచెం ఆత్మీయంగా అన్నాడు—ఎల్లుండి నీ తమ్ముడి పెళ్ళి. నీకిప్పుడు చాలా పనులున్నాయి. ఊరంతా తిరగాల్సి వస్తుంది. సైకిల్ కావాలి. అంతేకదా?

—అవునండి. అంతేనండి. అన్నాడు సదాశివం ఆశగా. —ఎలాగైనా మీరు నా సైకిల్ కొంచెం తొందరగా వెతికి పట్టుకోవాలి.

ఆత్మీయత మానేసి, తీక్షణంగా చూశాడు హెడ్డు. —ఏం? నీ సైకిల్ అయితేగాని నువ్వు తొక్కలేవా? చెప్పరా? నీ సైకిల్ ఈ పాటికే చేతులు మారి షేపులు మారి పోయుంటుందిగాని. అదిగో అటుచూడు—

చూశాడు సదాశివం. స్టేషన్ ప్రహరీ కివతల నాలుగు సైకిళ్ళు వరసగా ఉన్నాయి.

—చూశావా? అన్నాడు హెడ్డు. —అవన్నీ చోరీ సైకిళ్ళే. ఎవరి సైకిల్ ఎవరికి దక్కుతుందో తెలీదుగాని, నూటయాభై ఇచ్చి నీక్కావలసిన బండి పట్టుకెళ్ళు.

కథల్లో చెప్పినట్టు, తన చెవులను తానే నమ్మలేక పోయాడు సదాశివం.

—అదేమిటండీ? నా సైకిల్ పోతే, ఎవరి సైకిల్ నేనెలా?...

—అదంతేనయ్యా! మన పద్ధతి అంతే. నీ సైకిల్ అసలు దొరుకుతుందో లేదో తెలీదు. దొరికితే ఎప్పుడు దొరుకుతుందో తెలీదు. ఏం? సంవత్సరం పట్టొచ్చు. అంతవరకు ఆగుతావా? నీ ఇష్టం... నీకిప్పుడు ఒక సైకిల్ అత్యవసరం కాబట్టి, వన్‌ఫిఫ్టీ ఇచ్చెయ్— ఆ నాలుగింట్లో నీక్కావలసింది తీసుకో పో... ఒక్కదాన్నెంచుకో.

అయోమయం నుంచి తేరుకోలేక పోతున్నాడు సదాశివం. అంతలో ఫోన్ మ్రోగింది. —ఇదుగో రమణా! అని సెంట్రీని కేకేశాడు హెడ్డు. —వ్యవహారం అంతా ఈయనకి విడమర్చి చెప్పు... మొగుడు పిలుస్తున్నాడు. అంటూ రిసీవరందుకున్నాడు.

సెంట్రీ గుంభనంగా నవ్వుతుండూ వచ్చి సదాశివాన్ని వరండాలోకి తీసుకుపోయాడు. సైకిల్ చోరీల వ్యవహారాలన్నీ, వాటిలోని సూత్రాలన్నీ, సూక్ష్మంలో మోక్షంగా విడమర్చి చెప్పేశాడు. —పోయిన మీ సైకిల్ ఎలాగూ పోయిందిసార్. మళ్ళీ దొరుకుతుందనే ఆశలేదు. దొరికినా, అప్పుడైనా ఇంతే. మా హెడ్డుకి చేయి తడపందే సైకిల్ మీ చేతికిరాదు. అదేదో ఇప్పుడే చేస్తే, మీ సైకిల్ కన్న మంచిబండే పట్టుకెళ్ళొచ్చుగదా మీరు? చూడండి .. ఆ నాలుగిట్లో ఎర్రబండి చాలా బాగుంది.

గుమాస్తాగిరీ వెలగబెడుతున్న సదాశివానికి 'మామూళ్ళ' జాతకం మామూలే. సైకిళ్ళ రిజిస్ట్రేషన్లకు, లైసెన్సులకు, కాలాకాఫీలతో పనులకు కరెంటు కనెక్షన్‌కు అతను మామూళ్లు సమర్పించినవాడే! అయితే ఇదివేరు. ఇది పోలీసులతో వ్యవహారం; వెధవకొడుతే!

ఆలోచనలతో క్రిందు మీదవుతూ చాలాసేపు అలాగే ఉండిపోయాడు సదాశివం. జేబులో [illegible] ఉంది. నూటయాభై చెల్లించి మంచి సైకిలే తీసుకుపోవచ్చు. కాని...

అదరాబాదరాగా బయటికొచ్చాడు హెడ్డు. —[illegible] దొంగతనమట—నేను వెళ్ళాలిగానీ..., అంటూ సదాశివం వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

—ఏం తేల్చావయ్యా.

—ఏమీ... తగ్గదాండీ..., అన్నాడు సదాశివం, కొంచెం లౌక్యంగా.

—తెలివాడివే. దమ్మిడీ తగ్గదు. వంద నాకూ, యాభై రమణకూ... తొందరగా తేల్చు.., ఎస్సైయొస్తే కథ మారిపోతుంది...

—ఆ ఎర్రసీటు సైకిల్ తీసుకుంటానసుకోండి... అయితే ఎక్కడైనా అసలు ఓనర్ చూసి... గుర్తుపట్టి, ఇది తనదేనంటే ..

ఉరిమి చూశాడు హెడ్డు. —అసలు ఓనర్! ఎవడా అసలు ఓనర్? రమ్మనుచెప్తాను! వాడూ ఇక్కడికి రావలసిందే కదా! అంతెందుకూ?, అంటూవెళ్ళి సైకిల్‌కున్న ఎర్రసీటుకవర్ లాగేసి ఒక్క ఉదుటున దాన్ని [illegible] అవతలికి గిరాటేశాడు.., —ఇప్పుడు నువ్వే అసలు ఓనర్‌వి.. కాదనేదమ్ము ఎవరికి ఉంది?

సదాశివం డబ్బు అని లెక్కపెట్టటం పూర్తవుతుండగానే, చప్పున నోట్లని లాక్కున్నాడు హెడ్డు. —ఏం మనిషండీ బాబూ! ఇలా అయితే బ్రతకటం ఎలా? ఎస్సైయొస్తే వాటాలు తీస్తాడుగాని, వెంటనే బండెక్కి చెక్కెయ్..., అంటూ స్వంత సైకిల్ వైపునడిచాడు. నెత్తిన టోపీ సరిచేసుకుంటూ.



# మినీ కథ

## నిజాయితీ చిరునామా

సీటులో కూర్చున్నాడేగాని, పావనమూర్తి మనసు మనసులో లేదు. పొద్దున్న ఆఫీసుకు వచ్చినప్పటినుంచీ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

అయితే అతగాడు ఆలోచిస్తున్నది, తన పక్కసీట్లో కూర్చుని, 'మేగీ నూడుల్స్'లా నోరూరించే టైపిస్టు, 'మిస్ మార్గరెట్'ని ఎలా ట్రాప్ చెయ్యాలా అనికాదు.

ఎదురుసీట్లో కూర్చునే 'ఎల్డీసీ' ఏకనాథం నుంచి యాభై రూపాయల అప్పు ఎలా పుట్టించాలా అనికాదు... పోనీ, కొత్తగావచ్చిన 'బాస్'ని ఎలా కాకాపట్టాలా? అనికూడా కాదు.

మరింతకీ, అతగాడి మనసుని అంతలా దోచుకున్న విషయం ఏమిటంటే, ఆరోజు ఆఫీసుకి కొత్త 'స్టేషనరీ' స్టాకు రావడం.

ఆ పాలమీగడలాంటి తెల్లకాగితాల దొంతర్లని చూస్తుంటే, పాలకోవాలాంటి, పదహారేళ్ళ పడుచుపాపల్ని చూస్తున్నంత పరమానందంగా ఉంటుంది పావనమూర్తికి, అలాంటి అందమైన అమ్మాయిని లేపుకుపోవడంలో ఎంత 'థ్రిల్' ఉంటుందో, ఆ తెల్లకాగితాల దొంతర్లని మూడో కంటికి తెలీకుండా, ఇంటికి పట్టుకుపోవడంలో, అంతకు రెట్టింపు 'థ్రిల్' ఫీలవుతాడు పావనమూర్తి.

ఆ విషయమై, మధ్యాహ్నం 'టీ టైమ్' వరకూ అతి తీవ్రంగా ఆలోచించిన పావనమూర్తి ఓ నిర్ణయానికి వచ్చి, ప్యూను పాపారావుని పక్కకుపిల్చి, తన పథకాన్ని, అతగాడి చెవిలో, గాయత్రీ మంత్రంలా విశదీకరించి, ఉపదేశించాడు. చివరికెలాగైతేనేం, 'ఫిఫ్టీ ఫిఫ్టీ' ఒప్పందం మీద 'డీల్' 'సెటిల్' అయింది.

* * *

రాత్రి భోజనం ముగించాక, ఓ మీఠా పాన్ బిగించాక, ఆపైన ఓ 'ఫిల్టర్' సిగరెట్ వెలిగించాక, టేబిలుముందు కూర్చున్నాడతను.

ఎదురుగా టేబిలుపై, పాలమీగడలాంటి తెల్ల కాగితాల దొంతర్లు... అందులోని ఓ అరదస్తా కాగితాల్ని రైటింగ్ ప్యాడ్‌కి తగిలించి, కొత్తకథ రాయడం ప్రారంభించాడతను.

అతడు గొప్ప సామాజిక స్పృహగల రచయితగా తెలుగు పాఠకులచే అభిమానింప బడుతున్న ప్రఖ్యాత రచయిత.

అతని పేరు పావనమూర్తి!

అతను రాస్తున్న కథ పేరు... "నిజాయితీ నీ చిరునామా ఎక్కడ?"

—మధు చక్రవర్తి
(విశాఖపట్నం)